





తగ్గేదేలే

ఎన్నికల ఖర్చు రూ.600 కోట్లు..!

- పోటాపోటీగా ఓట్ల కొనుగోలు
- బద్వేలు, ప్రొద్దుటూరు, పులివెందులలో వైసీపీదే పైచేయి
- ఓటుకు రూ.వెయ్యి నుంచి రూ.3వేలు పంపిణీ
- కొన్నిచోట్ల చీరలు, ముక్కుపుడకలు, కాళ్లగొలుసులు అదనం
- ఒక్కో నియోజకవర్గానికి సరాసరిన రూ.80 కోట్లు పైనే ఖర్చు





రాను

రాను సార్వత్రిక ఎన్నికలు చాలా ఖరీదుగా మారుతున్నాయి. సామాన్యులు కూడా పోటీచేసే అవకాశం రాజ్యాంగం కల్పించినా.. కోటీశ్వరులు తప్ప వేరెవ్వరూ గెలవలేని పరిస్థితిని రాజకీయ నాయకులు సృష్టించారు. ఒకప్పుడు ప్రజాసేవ చేసిన వారు, నీతి నిజాయితీగా ఉన్న వారు ఇండిపెండెంట్‌లుగా కూడా గెలిచారు. ఇప్పుడు గెలవలాంటే డబ్బే ప్రథమ ప్రాధాన్యంగా మారిపోయింది. గత సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి కడప జిల్లాలోని 10 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో దాదాపు రూ.700 కోట్లు ఖర్చు చేశారని అంచనా. అయితే ఈసారి కడప జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోనే దాదాపు రూ.600 కోట్లు ఖర్చు చేశారని అంటున్నారు. బరిలో నిలిచిన ప్రధాన పార్టీల అభ్యర్థులు 'తేగ్గేదేలే' అనే రీతిలో డబ్బులో ఖర్చు చేశారు.

(కడప-ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలు టీడీపీ, వైసీపీ డూ ఆర్ డైగా మారాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈసారి గెలవాల్సిందేనని టీడీపీ కృతనిశ్చయంతో ఉండగా రెండోసారి అధికారం చేపట్టాలని వైసీపీ నిర్ణయించుకుంది. ఇక ఆలస్యంగా పీసీసీ చీఫ్ షర్మిల నేతృత్వంలో కాంగ్రెస్ బరిలో నిలిచింది. దీంతో ఎన్నికలు హోరాహోరీనే కాదు.. ఓట్ల కోసం డబ్బులను మంచినీళ్లప్రాయంగా ఖర్చు పెట్టారు. ఈసారి ఎన్నికల ఖర్చు ఎంత లేదన్నా రూ.600 కోట్లు ఉంటుందని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఎన్నికలకు ఆరు నెలల ముందు నుంచే 'టీడీపీ బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ' పేరిట ఇంటింటికీ ప్రచారం నిర్వహించగా.. వైసీపీ గడప గడపకు ప్రభుత్వం పేరిట ఇంటింటికీ వెళ్లింది. అయితే టీడీపీ సొంత ఖర్చుతో వెళితే.. వైసీపీ ప్రభుత్వ(ప్రజా) సొమ్ముతో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేపడుతూ వచ్చింది. ఇక ఎన్నికల షెడ్యూలు దగ్గర పడేకొద్దీ ప్రచారం ముమ్మరం చేస్తూ.. షెడ్యూలు తరువాత ప్రచారం పతాక స్థాయికి వెళ్లిపోయింది. హోరాహోరీగా ప్రచారం జరిపారు. పోల్ మేనేజ్‌మెంటు కూడా ఇరుపార్టీలు నువ్వా నేనా అన్నట్లు చేశాయంటారు. అధికార పార్టీ బద్వేలు, ప్రొద్దుటూరు, పులివెందులలో పెద్దఎత్తున ఖర్చు పెట్టిందంటారు. ఓటుకు సరాసరి రూ.వెయ్యి నుంచి రూ.3వేల వరకు ఇవ్వడంతో ఎన్నికల ఖర్చు అమాంతంగా పెరిగింది. ఓటు కొనుగోలే కాదు షెడ్యూలు రాక ముందునుంచే ప్రచారం నిర్వహించడం.. ఇక షెడ్యూలు వచ్చిన తరువాత రోజువారి ప్రచారాలు, ప్రచారం వెంట వచ్చిన వారికి డబ్బులు, మద్యం, ఫ్లెక్సీలు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రింట్‌మీడియాకు ప్రకటనలు, సోషల్ మీడియా కరపత్రాలు, ప్రచార వాహనాలు ఇలా అన్నీ కలుపుకుంటే ఖర్చు భారీ స్థాయికి వెళ్లిపోయింది.

ఓట్ల కొనుగోలు కోసం..

టీడీపీ, వైసీపీ ఏమాత్రం తీసిపోకుండా పోటీ పడి ఓట్లను కొనుగోలు చేశాయంటారు. 80 శాతం మంది ఓట్లకు డబ్బులు పంపిణీ చేసినట్లు చెబుతారు. కడపలో వెయ్యి చొప్పున ఇరుపార్టీలు పంపిణీ చేశాయి. అంటే ఒక్కో పార్టీ ఓట్ల కోసమే రూ.20 కోట్లు ఖర్చు పెట్టింది. ఇరుపార్టీలు కలిసి రూ.40 కోట్లు ఇచ్చాయి. మిగతా పార్టీలు కొంత మేర ఇచ్చాయంటారు. కడపలో ప్రచారానికి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, సీఎం జగన్ వచ్చారు. ఆ ఖర్చులు ఉండనే ఉంటాయి. ఒక్కో పార్టీ రూ.30 కోట్లకు తగ్గకుండా ఖర్చు పెట్టిందని అంటున్నారు.

మైదుకూరులో..

మైదుకూరులో హోరాహోరీ ఎన్నికలు జరిగాయి. పాతకాపులే మళ్లీ పోటీ పడ్డారు. ఈ సారి ఎలాగైనా గెలావాలన్న కసితో టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ సర్వశక్తులు ఒడ్డారు. వైసీపీ నుంచి పెద్దఎత్తున చేరికలు ఉన్నాయి. ఇక పోలింగ్‌రోజు కూడా ఇరుపార్టీలు దేనికీ తీసిపోలేదంటారు. ఒక్కో ఓటుకు ఒక్కో పార్టీ రూ.2వేలు పంచిందని అంటున్నారు. అంటే ఒక్కో పార్టీ ఓట్లకోసమే సుమారు రూ.40 కోట్లు ఖర్చు పెట్టింది. ఇతర ఖర్చులు ఎంత తక్కువ అనుకున్నా రూ.10 కోట్లు ఉంటాయి. అంటే ఇరుపార్టీలు కలుపుకుంటే రూ.100 కోట్లకు పైగా ఖర్చు పెట్టాయని అంటున్నారు.

బద్వేలులో..

బద్వేలులో పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయించారు. వైసీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే సుధా పోటీ చేశారు. ఇక్కడ టీడీపీ రూ.వెయ్యి పంచితే వైసీపీ రూ.1500 పంచిందంటారు. ఇక్కడ ఇరుపార్టీలు కలిసి ఓట్ల కోసమే రూ.40కోట్లకు పైగా ఖర్చు చేశాయంటారు. ఇతరత్రా కలుపుకుంటే ఖర్చు ఇంకా పెరుగుతుంది.

కమలాపురంలో..

టీడీపీ నుంచి పుత్తా కృష్ణచైతన్యరెడ్డి తొలిసారిగా బరిలో దిగితే.. వైసీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే రవీంద్రనాధరెడ్డి పోటీ చేశారు. ఎలాగైనా ఈసారి గెలవాలనే కసి టీడీపీలో ఉంది. అందుకు తగ్గట్లుగా వైసీపీకి ధీటుగా పోల్ మేనేజ్‌మంటు చేశారని అంటున్నారు. ఇరుపార్టీలు ఓటుకు రూ.2వేల చొప్పున పంపిణీ చేశాయి. ఇక్కడ కూడా ఖర్చు రూ.60 కోట్లు పైగానే జరిగిందని చెబుతారు.

ప్రొద్దుటూరులో..

ప్రొద్దుటూరు ఎన్నికలు జిల్లావ్యాప్తంగా ఆసక్తి రేకెత్తించాయి. టీడీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పోటీ చేయగా.. వైసీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పోటీ చేశారు. రాచమల్లు ఆర్థికంగా బలవంతుడు. ఎంతైనా ఖర్చు పెడతారంటారు. అందుకే ఒక్కో ఓటుకు రూ.2500 పంచారని అంటున్నారు. కొన్నిచోట్ల ముక్కుపుడకలు, చీరలు, కాళ్ల పట్టీలు సైతం పంచారని అంటున్నారు. టీడీపీ రూ2.వేలు పంపిణీ చేసిందని సమాచారం. ఇక్కడ ఇరుపార్టీలు కలిపి రూ.100 కోట్లకు పైగానే ఖర్చు చేసింటాయని ప్రచారం సాగుతోంది.

జమ్మలమడుగులో..

సీట్ల సర్దుబాటులో భాగంగా బీజేపీ నుంచి మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి పోటీ చేయగా.. వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి బరిలో నిలిచారు. ఇక్కడ నువ్వా నేనా అన్నట్లుగా సాగింది. ఇరువురు ఏ మాత్రం తీసిపోకుండా ఒక్కో ఓటుకు రూ.2వేలు పంచారు. అంతేకాకుండా చీరలు ఇతరత్రా కూడా పంపిణీ చేశారు. ఇక్కడ 80కోట్లు పైమాటే ఖర్చు అయిందని చెబుతారు.

పులివెందులలో..

ఇది సీఎం జగన్ సొంత నియోజకవర్గం. వైసీపీ నుంచి జగన్ పోటీ చేస్తుండగా టీడీపీ నుంచి మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి బరిలో దిగారు. వివేకాను చంపిన హంతకులకు ఓటు వేయవద్దని వివేకా కూతురు సునీత, జగన్ సోదరి షర్మిల పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. వివేకా హత్య వ్యవహారం ఎక్కడ డ్యామేజీ చేస్తుందో అనే భయం వైసీపీలో గూడు కట్టుకుందంటారు. అందుకే కొన్ని ప్రాంతాల్లో రూ.2500 నుంచి రూ.3వేల వరకు పంపిణీ చేశారని అంటున్నారు. ఇక టీడీపీ వెయ్యి పంచిందంటారు. ఇక్కడ ఇరుపార్టీలు కలిపి రూ.80 కోట్లకు పైగా ఖర్చు చేశాయని సమాచారం.

అగ్రనాయకుల సభలతో..

ఇక ఓట్ల కొనుగోలే కాకుండా సీఎం జగన్ ప్రొద్దుటూరు, పులివెందుల, మైదుకూరు, కడపలో జరిగిన బహిరంగసభల్లో పాల్గొన్నారు. దీన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న వైసీపీ జన సమీకరణకు విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు పెట్టింది. మీటింగ్‌కు వచ్చిన వారికి డబ్బు, మద్యం, బిర్యానీలు సరఫరా చేయడంతో భారీగా ఖర్చు అయిందంటారు. టీడీపీ కడప, ప్రొద్దుటూరులో నిర్వహించిన సభలకు చంద్రబాబునాయుడు వచ్చారు. వీటికి జనసమీకరణకు ఖర్చుఅయింది. ఇవి కాకుండా అసంతృప్తనేతలకు వైసీపీ డబ్బులు పంపిణీ చేసిందని చెబుతారు. వైసీపీ పులివెందులలో అయితే స్థాయిని బట్టి లక్ష మొదలుకుని రూ.5లక్షలు రూ.10 లక్షలు, రూ.20 లక్షలు ఇచ్చినట్లు చెబుతారు. ఇదే ఫార్ములాను జమ్మలమడుగు, ప్రొద్దుటూరులో అమలు చేశారని అంటున్నారు. ఇతర పార్టీల్లోని వారిని డబ్బులు ఇచ్చి వైసీపీలోకి తీసుకువచ్చారని చెబుతారు. బూత్, ఇతరత్రా ఖర్చులు కలిపితే జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.600 కోట్లు ఖర్చు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

క్షయ వ్యాధి నివారణకు వ్యాక్సినేషన్

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు



అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ నాగరాజు

కడప(కలెక్టరేట్), మే 16: క్షయ వ్యాధి నిర్మూలనలో భాగంగా 18 ఏళ్లు దాటిన వారందరికీ అడల్ట్ బీసీబీ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. గురువారం నగరంలోని రాధాకృష్ణ నగర్ యూపీహెచ్‌సీలో అడల్ట్ బీసీబీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 2025 నాటికి క్షయ వ్యాధి నిర్మూలనే ధ్యేయంగా ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. ఇందులో భాగంగా ప్రతి గురువారం జిల్లాలోని 645 సచివాలయాల పరిధిలో వ్యాధి నిర్మూలనకు అర్హులైన వారందరికీ బీసీబీ వ్యాక్సినేషన్ ఇస్తామన్నారు. గత ఐదేళ్లలో టీబీ వచ్చి తగ్గిపోయిన వారు, టీబీ రోగులతో సన్నిహిత సంబంధం కలిగిన వారు, 60 ఏళ్లు పైబడిన వారితో పాటు మధుమేహం, పొగతాగేవారు, 18 కేజీల కంటే బరువు తక్కువగా ఉండే వారందరూ బీసీజీ టీకా తప్పక వేయించుకోవాలన్నారు. ఈ వ్యాక్సినేషన్ వల్ల ఎలాంటి దుష్పరిణామాలు, ఇబ్బందులు ఉండవని, అపోహలను నమ్మవద్దన్నారు. 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న వారు, గర్భవతులు, పాలిచ్చే తల్లులు, హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులు లేదా ఏ వ్యాధితో నైనా బాధపడే వారు ఈ వ్యాక్సినేషన్ తీసుకోవద్దన్నారు. కార్యక్రమంలో మెడికల్ రీజనల్ డైరెక్టర్ రత్నకుమారి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వర కుమార్, డాక్టర్ రవిబాబు, నోడల్ అధికారి డాక్టర్ ఉబేదుల్లా, యూపీహెచ్‌సీ మెడికల్ అధికారి డాక్టర్ సుమధుర తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూముల భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

కడప (క్రైం), మే 16: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం ఈవీఎంలను భద్రపరిచిన ఉర్దూ నేషనల్ యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూముల వద్ద భద్రతా ఏర్పాట్లను ఎస్పీ సిద్ధార్ద్ కౌశల్ గురువారం రాత్రి పరిశీలించారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తి అయ్యేంత వరకు అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామన్నారు. 144 సెక్షన్ అమలులో ఉందని, నలుగురికంటే ఎక్కువమంది ఉండకుండా చర్యలు తీసుకోవాలని, నిరంతరం స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద నిఘా కెమాలతో పర్యవేక్షించాలని ఆదేశించారు. యూనివర్సిటీ పరిసర ప్రాంతాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ క్రిష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్ వద్ద సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ

మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హౌస్ అరెస్టు

- ఓటమిని జీర్ణించుకోలేక వైసీపీ దాడులు చేస్తోంది
- మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



చిన్నమండెం, మే 16: ఓటమిని జీర్ణించుకోలేక వైసీపీ నాయకులు, కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా దాడులకు తెగపడుతున్నారని, ఈ అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు వివిధ రాష్ట్రాలతో పాటు విదేశాల నుంచి వచ్చి రాత్రిళ్లు క్యూలైన్‌లో నిల్చొని టీడీపీకి ఓట్లు వేశారని రాయచోటి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ వారే దాడులు చేసి తనను హౌస్ అరెస్ట్ చేయడం ఏంటని ప్రశ్నించారు. బుధవారం రాత్రి రాయచోటిలో మార్కెట్‌యార్డు చైర్మన్, వైసీపీ నాయకుడు వండాడి వెంకటేశ్వర్లు ఇంటిపై చేసిన దాడిని టీడీపీపై రుద్దడం సబబు కాదన్నారు. బీసీలతో ప్రారంభమైన తెలుగుదేశం పార్టీ బీసీలపై దాడులు చేయదని, 20 సంవత్సరాల కాలంగా భూదందాలు, ఎర్రచందనం, డ్రగ్స్, స్మగ్లింగ్ వ్యవహారాల్లో ప్రమేయం ఉన్న వ్యక్తి వండాడి వెంకటేశ్వర్లు అని ఆరోపించారు. అలాంటి వ్యక్తిపై ఎవరో దాడి చేస్తే టీడీపీ చేసిందని నిందమోపడం ఏంటని నిలదీశారు. సంవత్సర కాలం క్రితం తన కుమార్తె వివాహం జరిగినా ఎన్నికల్లో తమ పరిధిలోని మహిళలకు వైసీపీకి ఓట్లు వేయాలని చీరలు పంచిపెట్టాడని, ఎన్నికల రోజు టీడీపీ ఏజెంట్లను సైతం ప్రలోభాలకు గురి చేయాలని చూసినా వారు వినకపోవడంతో వారిని కూడా బెదిరించిన వ్యక్తి వెంకటేశ్వర్లు అని తెలిపారు. అధికారులను అడ్డుపెట్టుకొని వైసీపీ నాయకులు బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఓ సీఐ స్థాయి వ్యక్తిని అడ్డుపెట్టుకుని తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులు, ఏజెంట్లను బెదిరించి తద్వారా ఎన్నికల్లో నెగ్గాలని స్థానిక వైసీపీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి చూస్తున్నారన్నారు.

రాజకీయ లబ్ధి కోసం

హిందూ, ముస్లింల మధ్య చిచ్చు

15 సంవత్సరాలు రాయచోటి ప్రజలను మోసం చేస్తూ కేవలం తన రాజకీయ లబ్ధి కోసం అన్నదమ్ములు లాంటి హిందూ, ముస్లింల మధ్య చిచ్చుపెట్టి రాజకీయం చేస్తూ ఏ ఎండకు ఆ గొడుగు పట్టే వ్యక్తి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అని విమర్శించారు. తామెంతో పేరుగాంచిన వైసీపీ నాయకులమనే చెప్పుకుంటున్న వారి సొంత మండలాల్లోని ప్రతి బూత్‌లో పూర్తి స్థాయిలో టీడీపీ ఏజెంట్లను నియమించడాన్ని వైసీపీ శ్రేణులు జీర్ణించుకోలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. శ్రీకాంత్‌రెడ్డి, తన అనుచరుల కారణంగా చాలా మంది టీడీపీ కార్యకర్తలు మానసికంగా, ఆర్థికంగా, శారీరకంగా హింసకు గురయ్యారన్నారు. పోలీసులు, ఎన్నికల వ్యవస్థపై పూర్తి నమ్మకం ఉందని, మేము న్యాయపరంగా పోరాడుతాం అని మండిపల్లి అన్నారు. రానున్నవి మంచిరోజులని కార్యకర్తలు, నాయకులు, అభిమానులు సహనం పాటించాలన్నారు. రాష్ట్రంలో, రాయచోటిలో రానున్నది తెలుగుదేశం ప్రభుత్వమేనని వైసీపీ నేతలు, వండాడి వెంకటేశ్వర్లు ద్వారా నష్టపోయిన ప్రతి కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. రాంప్రసాద్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేయడంతో వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఆయన నివాసానికి చేరుకుని ఆయనకు మద్దతు పలికారు.

కాయ్ రాజా కాయ్..

- పులివెందులలో జోరుగా బెట్టింగులు
- కడప ఎంపీతో పాటు పులివెందుల అసెంబ్లీ మెజార్టీపై పందేలు
- మధ్యవర్తుల సమక్షంలో చేతులుమారుతున్న డబ్బు

ప్రభుత్వం మళ్లీ ఏర్పాటు చేయాలని వైసీపీ, అవినీతి పాలన అంతమొందించాలని టీడీపీ ఎన్నికల్లో పోటాపోటీగా పనిచేశాయి. పోలింగ్ ముగిసింది, లెక్కింపు మిగిలింది. తీర్పు ఎవరికి అనుకూలం అన్నదే ఇప్పుడు అందరి మదినీ తొలుస్తున్న ప్రశ్న. ఈ వాతావరణాన్ని క్యాష్ చేసుకోవాలని బెట్టింగ్ రాయుళ్లు ముందుకొచ్చారు. వారి ప్రోద్బలంతో నాయకులు కూడా పందేలు కాస్తున్నారు. అయితే వైసీపీ నాయకులు కాస్త వెనుకంజ వేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ఎప్పుడూ లేని విధంగా రాత్రి 10 గంటల వరకు పులివెందుల నియోజకవర్గంలో పోలింగ్ జరిగింది.



పులివెందుల టౌన్, మే 16: ఎన్నికల ఫలితాలపై పులివెందుల ప్రాంతంలో జోరుగా బెట్టింగులు జరుగుతున్నాయి. ఈ బెట్టింగులు ప్రధాన పార్టీల అభ్యర్థుల ఎంపిక నుంచే ఆరంభమయ్యాయి. తొలుత ఏపార్టీ తరపున ఎవరు అభ్యర్థి అవుతారనే పందేలు కాయగా.. ఇపుడు పార్టీల విజయాలపై బెట్టింగులు మరింత ఊపందుకున్నాయి. ప్రధాన పార్టీల అభిమానులతో పాటు ఇతర రంగాల వ్యాపారులు కూడా లాభాపేక్షతో బెట్టింగులు కాస్తున్నారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ వర్గీయులు.. వైసీపీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ సానుభూతిపరులు బెట్టింగులు పెడుతున్నారు.

వైసీపీ అభిమానుల వెనకడుగు

రాష్ట్రంలో అధికారంలోకి ఎవరు వస్తారనే దానిపై సాగినా వైసీపీ అభిమానులు పోలింగ్ తర్వాత కాస్త వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. పెరిగిన ఓటింగ్ వైసీపీకి వ్యతిరేకంగా ఉంటుందని కంగారుపడుతున్నారు. పోలింగ్ అధికశాతం జరగడంతో వైసీపీ నాయకులకు చెమటలు పట్టాయి. పులివెందుల అసెంబ్లీ అభ్యర్థి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మెజార్టీ గతం కంటే పెరుగుతుందని కొంతమంది, తగ్గుతుందని మరికొంతమంది జోరుగా బెట్టింగులు కడుతున్నారు. అలాగే పార్లమెంటు సీటు ఎవరు గెలుస్తారు, జిల్లాలో ఏ పార్టీకి ఎన్నిసీట్లు అనే అంశాలపై అధిక సంఖ్యలో బెట్టింగులు జరుగుతున్నాయి. కడప పార్లమెంటు అభ్యర్థులుగా పోటీచేసిన వైఎస్ అవినాశ్‌రెడ్డి, వైఎస్ షర్మిల, భూపేశ్‌రెడ్డిలపై ఆయా నియోజకవర్గాలలో వచ్చే మెజార్టీలపై జోరుగా బెట్టింగులు జరుగుతున్నాయి. ప్రతిసారి ఎన్నికలలో బెట్టింగులు పెట్టడం ఆనవాయితీగా మారింది. 2019లో ఇరుపార్టీలకు చెందిన అభిమానులు పందేలు పెట్టగా వైసీపీ వర్గీయులు గెలుచుకున్నారు. ఈసారి కూడా కోట్లాది రూపాయలు పులివెందుల నియోజకవర్గంలో పందేలు జరుగుతున్నట్లు సమాచారం.

బెట్టింగులు ఎంతంటే..

కాంగ్రెస్ కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిల తరఫున రూ.1.20లక్షలు పందెం కాస్తే, వైసీపీ అభ్యర్థి అయిన వైఎస్ అవినాశ్‌రెడ్డి తరపున రూ.1.50లక్షలు బెట్టింగ్ కాస్తున్నారు. కడప ఎంపీ వైసీపీ అభ్యర్థి తరపున రూ.లక్ష పందెం కాస్తే టీడీపీ అభ్యర్థి తరపున రూ.1.50లక్షల బెట్టింగ్ కాస్తున్నారు. అంటే ఒకటికి ఒకటిన్నర. అలాగే పులివెందుల అసెంబ్లీ వైసీపీ అభ్యర్థి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మెజార్టీపై రూ.1.50లక్షలు, టీడీపీ గెలిస్తే లక్ష రూపాయలు ఇచ్చేలా బెట్టింగ్ కాస్తున్నారు. అంటే ఈ బెట్టింగులు ఇదే రేషియోలో పెంచుకుంటూ పోతారు. కొందరు మధ్యవర్తులు పదిశాతం ఇంకొందరు ఐదుశాతం కమీషన్ తీసుకుంటున్నట్లు సమాచారం.

20 నుంచి ఏపీఆర్‌జేసీ కౌన్సెలింగ్

- రాయలసీమ కన్వీనర్ డాక్టర్ చెన్నకేశవులు



వీలేరు, మే 16: ఏపీఆర్‌జేసీ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో బాలుర ప్రవేశాల కోసం ఈనెల 20వ తేదీ నుంచి కౌన్సెలింగ్ ఏర్పాటు చేసినట్లు రాయలసీమ కన్వీనర్ డాక్టర్ చెన్నకేశవులు తెలిపారు. రాయలసీమ జిల్లాల్లోని విద్యార్థులకు కేవీపల్లె మండలం గ్యారంపల్లెలోని ఏపీఆర్‌జేసీ కళాశాలలో కౌన్సెలింగ్ ఉంటుందని ఆయన తెలిపారు. ఎంపీసీ గ్రూపునకు ఈనెల 20వ తేదీ, బైసీపీకి 21న, ఎంఈసీ, సీఈసీ గ్రూపులకు 22న కౌన్సెలింగ్ ఉంటుందని ఆయన వివరించారు. కౌన్సెలింగ్ కోసం విద్యార్థులను 1:5 నిష్పత్తిలో పిలుస్తున్నామని, కాల్ లెటర్ అందిన వారు బాలురు మాత్రమే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని, తమకు నిర్దేశించిన రోజుల్లో ఉదయం 9 గంటలకల్లా కళాశాలలో ఉండాలని ఆయన తెలిపారు. కాల్ లెటర్లను ఏపీఆర్ఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్ సైట్ నుంచి కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని ఆయన సూచించారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు తమ వెంట ఒరిజినల్ సర్టిఫికెట్లు, మూడు సెట్ల జిరాక్స్ కాపీలు తెచ్చుకోవాలని ఆయన తెలిపారు.

వైభవంగా గంగమ్మ జాతర

- మొక్కులు తీర్చుకున్న భక్తులు
- వేలాదిగా తరలివచ్చిన జనాలు

రైల్వేకోడూరు, మే 16: పట్టణంలో గురువారం జరిగిన గంగమ్మతల్లి జాతర అంగరంగ వైభవంగా నిర్వహించారు. జాతరకు తిరుపతి, కడప, చిత్తూరు, శ్రీకాళహస్తి, వెంకటగిరి, తమిళనాడు, కర్ణాటక, రైల్వేకోడూరు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. భక్తులు గంగమ్మతల్లిని దర్శించుకుని పూజలు చేశారు. బుధవారం పూలపల్లకిని అంకాళమ్మ ఆలయం వద్దకు తీసుకుని వచ్చారు. అక్కడ గంగమ్మ తల్లి ప్రతిమను మట్టితో తయారు చేశారు. అమ్మవారి నగలను తీసుకుని వచ్చి అలంకరించారు. అక్కడి నుంచి గంగమిట్ట వరకు గంగమ్మతల్లిని ఊరేగించారు. ఊరేగిస్తుండగానే అమ్మవారికి పొట్టేళ్లు, మేకపోతులు, కోళ్లను భక్తులు సమర్పించారు. మొదట బలిజవీధిలో ముద్దలు పెట్టి పూజలు చేశారు. ఉదయం 5 గంటలకే జాతర ప్రాంగణం భక్తులతో నిండిపోయింది. తెల్లవారే సరికి గంగమ్మతల్లిని గుడిలోకి తీసుకుని వెళ్లారు. అప్పటి నుంచి శుక్రవారం ఉదయం వరకు దర్శనాలు కల్పిస్తారు. తర్వాత నిమజ్జనం చేస్తారు. అన్నదానాలు, మజ్జిగ తదితర వాటిని భక్తులకు పంపిణీ చేశారు.





బ్రహ్మంగారి ఆరాధనకు ప్రత్యేక బస్సులు

మైదుకూరు/బద్వేలు, మే 16: బ్రహ్మంగారిమఠంలోని బ్రహ్మంగారి ఆరాధనకు మైదుకూరు డిపో నుంచి 22 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజరు కె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం నుంచి 19వ తేదీ వరకు మైదుకూరు నుంచి మిట్టమానుపల్లె మీదుగా 7 బస్సులు, మల్లేపల్లె మీదుగా 15, జ్యోతి క్షేత్రానికి 2 బస్సులు ఏర్పాటు చేశామని ఈ అవకాశాన్ని భక్తులు వినియోగించుకోవాలని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

బద్వేలు నుంచి... : బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం బ్రహ్మంగారి మఠానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు బద్వేలు డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 19వ తేదీ వరకు జరిగే ఆరాధనోత్సవాలు పురస్కరించుకుని బద్వేలు బస్ డిపో నుంచి 12 స్పెషల్ బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కావున ఈ అవకాశాన్ని భక్తులందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

అక్రమ కట్టడాల కూల్చివేతకు హైకోర్టు ఆదేశాలు

ప్రొద్దుటూరు, మే 16: కొత్తపల్లె పంచాయితీలోని సర్వే నెంబరు 411, 213-బిలో కాల్వకు సంబంధించి స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన అక్రమ కట్టడాలను రెండు నెలల్లోగా కూల్చివేయాలని హైకోర్టు కలెక్టర్‌ను ఆదేశించింది. ఈ మేరకు కలెక్టరుకు ఉత్తర్వులు జారీ అయ్యాయని హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కరుణాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాల్వ స్థలం కబ్జా చేసి కట్టడాన్ని నిర్మించడంపై కలెక్టర్ సహా ఆర్డీవో, తహసీల్దారు, పంచాయతీ కార్యదర్శికి సైతం ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. అందువల్లే వారందరినీ ప్రతివాదులుగా చేర్చుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం వేశామన్నారు. కోర్టు విచారించి అక్రమ కట్టడాన్ని రెండు నెలల్లోపు తొలగించాలని ఆదేశించిందన్నారు. కాల్వ స్థలాన్ని ఆక్రమించి అక్రమ నిర్మాణం చేపట్టింది అధికార వైసీపీకి చెందిన కౌన్సిలర్ అని అందుకే అధికారులు చర్యలు తీసుకోలేదని కరుణాకర్ ఆరోపించారు.

సాంకేతిక లోపంతో ఆర్టీఏ సేవలకు అంతరాయం

సికెదిన్నె, మే 16: సాంకేతికలోపం కారణంగా సారధి పోర్టల్ డేటాబేస్‌కు అంతరాయం ఏర్పడినట్లు ఉపరవాణా కమిషనర్ మీరాప్రసాద్ తెలిపారు. సాంకేతికలోపం వలన 16వ తేదీ గురువారం నుంచి 18వ తేదీ వరకు సారధి పోర్టల్ డేటాబేస్ అందుబాటులో ఉండదని, లెర్నింగ్ లైసెన్స్ డ్రైవింగ్ లైసెన్స్ సేవలు నిలిపివేశామని, 18వ తేదీ ఉదయం 10 గంటల తర్వాత సేవలు యధావిధిగా అందుబాటులోకి వస్తాయని దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించి రవాణా శాఖకు సహకరించాలని కోరారు.

ఆరుగురు నిందితుల అరెస్టు

రాయచోటి టౌన్, మే 16: పట్టణంలోని గాలివీడు రోడ్డులోని లక్ష్మీపురంలో నివాసం ఉంటున్న రాయచోటి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు ఇంటిపై దాడి చేసిన ఆరుగురిని రాయచోటి అర్బన్ పోలీసులు గురువారం అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. పోలీసుల కథనం మేరకు.. ఈనెల 13న జరిగిన ఎన్నికల్లో వైసీపీకి చెందిన వెంకటేశ్వర్లు, తెలుగుదేశం పార్టీకి చెందిన కొందరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో ఈనెల 15 రాత్రి వెంకటేశ్వర్లు ఇంటిపైన కొందరు వ్యక్తులు దాడి చేశారు. ఇంటి ప్రహరీగోడకు ఉన్న సోలార్‌వైర్లను కత్తిరించి ఇంట్లోకి ప్రవేశించి అక్కడ ఉన్న జీపు అద్దాలు, కుర్చీలు, లైట్లు పగులకొట్టారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు రాయచోటి డీఎస్పీ రామచంద్రారావు, సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్ఐ భక్తవత్సలం ఆధ్వర్యంలో దాడికి పాల్పడిన వారిలో అరుగురిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. నిందితులను 14 రోజుల రిమాండ్ విధించారు. నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ కృష్ణారావు హెచ్చరించినట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తు నీటిలో పడి యువకుడు మృతి



వల్లూరు, మే 16: మండల పరిధిలోని ఆదినిమ్మాయపల్లె డ్యాం వద్ద నీటిలో పడి యువకుడు మృతి చెందినట్లు ఎస్ఐ కత్తి వెంకటరమణ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు... కడప బీకేఎం స్ట్రీట్‌కు చెందిన మోహనసాయి (21) తన స్నేహితులతో కలిసి గురువారం మధ్యాహ్నం సరదాగా ఈత కొడుతుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. దీంతో గమనించిన స్నేహితులు గట్టిగా కేకలు వేయడంతో అక్కడున్న కొంతమంది వెతికినా కనిపించలేదు. కొద్ది సేపటికి మళ్లీ వెతకగా మృతదేహం బయటపడింది. మోహన్‌సాయి బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి కళ్యాణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు.

దాడి కేసులో ముగ్గురు అరెస్టు

మైదుకూరు, మే 16: చాపాడు మండలం విశ్వనాథపురంలో పోలింగ్ ఏజెంట్‌గా కూర్చున్న భూమిరెడ్డి చంద్ర ఓబుళరెడ్డిపై దాడి జరిగిన కేసులో గురువారం ముగ్గురిని అరెస్టు చేశారు. బుధవారం సాయంత్రం మైదుకూరులో చంద్ర ఓబుళరెడ్డిపై బీరు సీసాలతో దాడి చేసిన ఘటనపై పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు, చాపాడు మండలం విశ్వనాథపురం వాసులు కార్తీక్‌రెడ్డి, బొచ్చు సుబ్బారెడ్డి, ఇల్లూరి సుబ్బారెడ్డిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపెట్టగా రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ మస్తాన్ తెలిపారు.

సచివాలయ సర్వేయర్ ఇంట్లో చోరీ

ఏడు తులాల బంగారు నగలు అపహరణ

కడప క్రైం, మే 16: కడప నగరం అంబాభవానీ నగర్‌లో నివశిస్తున్న సర్వేయర్ ప్రేమ్‌కుమార్ ఇంట్లో దొంగలు పడి బంగారు నగలు అపహరించినట్లు తాలుకా పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు... ప్రేమ్‌కుమార్ అంబాభవానీ నగర్‌లోని సచివాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తున్నారు. ఈనెల 13వ తేదీ కుటుంబ సభ్యులతో కలిసి ప్రొద్దుటూరుకు వెళ్లి తిరిగి గురువారం వచ్చారు. దొంగలు ఇంట్లో పడి ఏడు తులాల బంగారు నగలు అపహరించినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఝరికోన సాగునీరు అందేనా..?

- ప్రాజెక్టులో నీళ్లున్నా రైతులకు ఫలితం సున్నా
- కాలువల నిర్మాణం కోసం రూ.42.25 కోట్లు ప్రకటించిన జగన్
- ఐదేళ్లయినా ఆ ఊసే లేదు
- ఇదీ ఝరికోన పరిస్థితి

ఝరికోన ప్రాజెక్టు ఒకప్పుడు చిత్తూరు, కడప జిల్లాల పరిధిలో ఉండేది. జిల్లాల పునర్విభజన తరువాత ఇప్పుడు అన్నమయ్య జిల్లాలోనే ఉంది. అయినా దీనిని ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. మూడు మండలాల్లోని 5వేల ఎకరాలకు సాగునీరు, రెండు మండలాలకు తాగునీరు అందించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. ప్రాజెక్టులో నీరున్నా.. కాలువల్లేక ఒక్క ఎకరాకు కూడా సాగునీరు అందడం లేదు. ఏళ్లుగా రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు.



నీటితో కళకళలాడుతున్న ఝరికోన ప్రాజెక్టు



నిలిచిపోయిన కాలువ పనులు

ఐదేళ్లవుతున్నా ఎందుకు పనులు చేయలేదు..



2019లో ఝరికోన కాలువలకు నిధులు మంజూరు చేస్తే ఇప్పటివరకు పనులు ఎందుకు చేయలేదో చెప్పాలి. భూగర్భజలం అడుగంటడంతో బోరుబావుల్లో నీళ్లు రావడం లేదు. పొలం తడవాలంటే కాలువల నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉంది.

- శ్రీహరి, పెద్దకోడివాండ్లపల్లె, సంబేపల్లె మండలం

సంబేపల్లె, మే 16: బాహుదానదిపై నిర్మించిన ప్రాజెక్టు ఝరికోన. ఈ ప్రాజెక్టు పేరు చెప్పగానే గుర్తుకొచ్చే మండలం సంబేపల్లె. ఈ ప్రాజెక్టు సంబేపల్లె, కేవీపల్లె, సుండుపల్లె మండల ప్రజలు, కరువు రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని 2005లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి రూ.34 కోట్లతో 0.5 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. ఈ మూడు మండలాలకు 5 వేల ఎకరాలు సాగునీరు సంబేపల్లె, చిన్నమండెం మండలాలకు తాగునీరు అందించడమే లక్ష్యంగా నిర్మించారు. 20 సంవత్సరాలు కావస్తున్నా ఒక్క ఎకరా పొలానికి కూడా సాగునీరు అందలేదు. ప్రాజెక్టు నిండినా రైతులకు ప్రయోజగనం చేకూరడం లేదు. 2019లో వైసీపీ ప్రభుత్వం కొలువుదీరాక డిసెంబరు 25న రాయచోటి గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం జగన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఝరికోన ప్రాజెక్టు ఇరిగేషన్ కాలువల నిర్మాణానికి రూ.42.25 కోట్లు మంజూరు చేసినట్లు ప్రకటించారు. ఇది కేవలం ప్రకటనలకే పరిమితం అయింది. దీంతో ఝరికోన కాలువల నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి.

ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశ్యం

రాయలసీమ కరువు జిల్లాల్లో అప్పటి ఉమ్మడి కడప జిల్లా ఒకటి. ఈ ప్రాంతంలో రైతులు ప్రతియేటా వర్షాలు కురవక పెట్టిన పంటలు పండక కరువు కాటకాలతో ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఇందులో సంబేపల్లె మండలం ఒకటి. 2005లో ఝరికోన ప్రాజెక్టు నిర్మాణానికి మొదటి విడత రూ.34 కోట్లతో మట్టికట్ట, తూము, అలుగు నిర్మాణాలను ప్రారంభించారు. సంబేపల్లె మండలంలో 1000 ఎకరాలు, సుండుపల్లె మండలంలో 2 వేల ఎకరాలు, కేవీపల్లె మండలంలో 2 వేల ఎకరాలకు సాగునీటితో పాటు.. చిన్నమండెం, సంబేపల్లె మండలాలకు తాగునీరు అందించే విధంగా ప్రాజెక్టు నిర్మాణం చేశారు. 2009లో ప్రాజెక్టు పనులు పూర్తిచేశారు. అనంతరం కాలువల నిర్మాణం చేపట్టేందుకు నిధుల కోసం ఎదురు చేశారు. అప్పటి నుంచి ప్రాజెక్టులో నీరు ఉన్నా చేపల పెంపకానికి తప్ప రైతులకు ప్రయోజనం జరగలేదు. 2012లో అప్పటి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి కలకడ, కేవీపల్లె, కలికిరి మండలాలకు రూ.58 కోట్లతో గ్రావిటీ వాటర్ ద్వారా తాగునీటి స్కీములు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ ప్రాంతవాసులకు తాగునీటికి మాత్రమే ఉపయోగపడుతోంది. ఈ నేపథ్యంలో 2019లో వైసీపీ ప్రభుత్వం కొలువుదీరాక.. లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా కుడి, ఎడమ కాలువల నిర్మాణం కోసం రూ.42.25కోట్లు మంజూరు చేసినట్లు అదే ఏడాది డిసెంబర్‌లో ప్రకటించారు. అయితే పనులు మాత్రం జరగలేదు. ఇప్పటికైనా కాలువల నిర్మాణం పూర్తి చేసి తమకు సాగునీరు అందించాలని సంబేపల్లె, చిన్నమండెం, కేవీపల్లె మండలాల ప్రజలు కోరుతున్నారు.



నేటి నుంచి కన్నెలూరులో గంగజాతర

- *144 సెక్షన్ ఉంది... నిబంధనలు పాటించండి*
- *ప్రజలకు గ్రామ పెద్దల విజ్ఞప్తి*

జమ్మలమడుగు, మే 16: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని కన్నెలూరులో ఈనెల 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు గంగజాతర ఆవుల పబ్బం మహోత్సవం విజయవంతం చేయాలని గ్రామ పెద్ద, న్యాయవాది మురళీధర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం రాత్రి కన్నెలూరు గ్రంథాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరులతో వారు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో జరిగిన అల్లర్లను దృష్టిలో పెట్టుకుని పోలీసు అధికారులు గంగమ్మ జాతరకు అనుమతి ఇచ్చేది లేదని తేల్చి చెప్పారన్నారు. అయినా గ్రామస్తులంతా కలిసి డీఎస్పీ కార్యాలయం వద్దకు, అర్బన్ పోలీసుస్టేషన్ సీఐ కరుణాకర్ వద్దకు వెళ్లి చేసిన విజ్ఞప్తి మేరకు ఎలాంటి సమస్యలు లేకుండా జాతర నిర్వహించుకుంటామని చెప్పడంతో అంగీకరించినట్లు వారు తెలిపారు. అయితే జాతర మూడు రోజుల్లో గ్రామస్థులు బంధువులను పిలుచుకోరాదని, రాజకీయ నేతలను పిలువరాదని, మద్యం ఉపయోగించరాదని, నిబంధనలు పెట్టారు. దీనికి గ్రామ ప్రజలు సమావేశం వద్దనే ఒప్పించారు. ఈ కార్యక్రమాలు ఎక్కడా ఎలాంటి సమస్యలు లేకుండా విజయవంతం చేసుకుని గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కమిటీ వారు, గ్రామస్థులు అంగీకరించారు. ఒకానొక దశలో కమిటీ పెద్దలు అన్ని పార్టీల నాయకులను కలిసి గంగ జాతర గురించి వివరించారు. పోలీసుల నిబంధనలను వివరిస్తూ జాగ్రత్తలు పాటించాలని తెలిపినట్లు వారు వివరించారు. దీంతో నాయకులు కూడా అంగీకరించారు. 17వ తేదీ ఉదయం 9 గంటల నుంచి గ్రామ దేవతలకు పూజలు చేయడం, 10 గంటల నుంచి బొల్లేవు గ్రామోత్సవం, అదేరోజు మధ్యాహ్నం అమ్మవారికి కలశ స్థాపన తదితర పూజా కార్యక్రమాలు జరుగుతాయి. అదేరోజు రాత్రి ఆలయం ఎదురుగా పాలేటి గంగకు బోనం సమర్పిస్తారు. 18వ తేదీ శనివారం ఉదయం నుంచి అమ్మవారి తమ్ముళ్ల వేషధారణ, పోతురాజులు గ్రామంలో తిరుగుట, నాగులకు పూజలు, రాత్రి గంగవేషం, గంగ కాటమ రాజుకథ చెబుతారు. 18వ తేదీ బోనాలతో గ్రామోత్సవం ముగుస్తుంది. ఈ ఉత్సవాల్లో గ్రామస్థులు గ్రామ పెద్దలు ఇచ్చిన నిబంధనలు పాటించాలని, పాటించకుంటే పోలీసు అధికారులు గ్రామస్థులపై చర్యలు తీసుకుంటారని గ్రామ పెద్దలు సమావేశంలో తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మోహన్‌రెడ్డి, కౌన్సిలర్ బాణా శివరామలింగారెడ్డి, పార్థసారధి, నవనీశ్వరరెడ్డి, గజ్జెల లక్షుమయ్య, చంద్ర, రఘురామయ్య, వేణు, తదితరులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గ్రామ పెద్ద మురళీధర్‌రెడ్డి తదితరులు

28 నుంచి కోర్టులో గంగమ్మ జాతర

మదనపల్లె అర్బన్, మే 16: స్థానిక కోర్టులో వెలసిన కోర్టులో గంగమ్మ జాతరను ఈనెల 28, 29 తేదీల్లో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. గురువారం ఆలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆలయకమిటీ కార్యదర్శి మార్పురి ప్రభాకర్‌నాయుడు మాట్లాడుతూ కోర్టులో గంగమ్మ జాతరకు సంబంధించి గురువారం చాటింపు వేశామని తెలిపారు.

ఈ నెల 28వ తేదీ అమ్మవారి ఆలయంలో ప్రతిష్ఠ రాత్రి తిరుణాల, 29వ తేదీ పగలు తిరుణాల అంగరంగవైభవంగా నిర్వహిస్తామన్నారు. అదేరోజు రాత్రి వివిధ రకాల కళాకారులతో బళ్లారి డ్రమ్స్, చెక్కభజనలతో ఊరేగింపుగా తరలివెళ్లి అమ్మవారిని జలజిలో కలిపే కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

అదేవిధంగా జాతర పోస్టర్‌ను ఆలయంలో ఆలయకమిటీ సభ్యులు ఆవిష్కరించారు. అమ్మవారి జాతరలో అధిక సంఖ్యలో పాల్గొనే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు మార్పురి చిన్నరెడ్డెప్ప పేర్కొన్నారు. కార్యక్రమాలను ఆలయకమిటీ ఉపాధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్‌నాయుడు, కార్యదర్శి మార్పురి ప్రభాకర్ నాయుడు ట్రెజరర్లు రాటకొండ రంగస్వామినాయుడు, జోలెపాళ్యం కరుణాకర్‌నాయుడు, ఆలయ ప్రత్యేక ఆహ్వానితుడు జోలెపాళ్యం భవానీప్రసాద్, మార్పురి మహేష్, మార్పురి విక్కి, జోలెపాళెం దేవేంద్ర(చిన్ని), బోయపాటి శ్రీనివాసులునాయుడు, ఉపాండ్ల కృష్ణకుమారి, తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

విహారయాత్రకు ఆర్టీసీ బస్సులు

మదనపల్లె అర్బన్, మే 16: వేసవి సెలవుల్లో విహారయాత్రకు మదనపల్లె ఆర్టీసీ నుంచి బస్సులు నడుపుతున్నట్లు వన్‌డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మదనపల్లె వన్ డిపో నుంచి ఊటీ, మైసూరు ప్రదేశాలకు విహారయాత్ర నిమిత్యం సూపర్ లగ్జరీ బస్సులు అందుబాటులో ఉంచామన్నారు. ఈ బస్సులు 20వ తేదీ రాత్రి 9 గంటలకు మదనపల్లెలో బయలుదేరి 21వ తేదీ ఉదయం ఊటీ చేరుకుంటుందని, ఆ రోజంతా ఊటీలో ఉండి 22వ తేదీ ఉదయం ఊటీ నుంచి బయలుదేరి మైసూరు చేరుకుని అక్కడ ప్రదేశాలను దర్శించిన అనంతరం సాయంత్రం బృందావన్ గార్డెన్స్‌లో లైటింగ్‌షో చూసుకుని రాత్రికి అక్కడ నుంచి బయలుదేరి 23వ తేదీ ఉదయం మదనపల్లెకు బస్సు చేరుకుంటుందన్నారు. పోనురాను ఒక్కరికి ఛార్జీ రూ.2800 మాత్రమే అన్నారు. యాత్ర ప్రియులు, ప్రయాణీకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాలకు ఈ ఫోన్ నెంబర్లకు 7382875034, 7382876658, 9441646104, 9440249483 సంప్రదించాలని కోరారు.

బి.కొత్తకోటలో బాలుడు అదృశ్యం

బి.కొత్తకోట, మే16: బి.కొత్తకోట పట్టణంలోని పంజూరమ్మ వీధికి చెందిన ఓ బాలుడు అదృశ్యం అయినట్లు సీఐ సూర్యనారాయణ తెలిపారు. తన కుమారుడు దండు ఋషివర్ధన్ (12) గురువారం ఉదయం నుంచి కనిపించలేదని తండ్రి మహేష్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నామన్నారు. ఋషివర్ధన్‌కు మతిస్థిమితం సరిగా లేదన్నారు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు తండ్రి ఫోన్‌నెంబరు 6303624722 కు లేదా 9440900707 నెంబరుకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

దాడి కేసులో రిమాండ్‌కు నిందితురాలు

మదనపల్లె అర్బన్, మే 16: ఫిబ్రవరి నెలలో దారి విషయంగా ఇరువర్గాలు దాడి చేసుకున్న సంఘటనలో గంగాధర్‌పై దాడి చేసిన కేసులో నిందితురాలు సునీత (32)ను గురువారం రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. పోలీసుల వివరాల మేరకు... స్థానిక చీకలగుట్టకు చెందిన గంగాధర్, సుజాత ఇరువర్గాలు దాడి చేసుకున్నారని అప్పట్లో ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా ఈ కేసుకు సంబంధించిన సుజాతను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు.


23న ధర్మపథంలో పౌర్ణమి వేడుకలు

వాల్మీకిపురం, మే 16: వాల్మీకిపురం పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథంలో 23న (గురువారం) పౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు తెలిపారు. ఉదయం ఆలయంలోని మూలవర్లకు అభిషేకాలు, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు, సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సామూహిక సత్యనారాయణవ్రత వేడుకలు, అభయాంజనేయ స్వామికి వడమాల, తోమాల సేవలు ఆకుపూజ, విశేష అలంకరణలు నడుమ పౌర్ణమి పూజలు నిర్వహించనున్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో.. స్వేచ్ఛాపతాకం

మైదుకూరు, మే 16: మైదుకూరు నియోజకవర్గంలో ఏ ఎన్నికలు జరిగినా అక్కడ అధికార పార్టీ నేతదే పెత్తనం. అక్కడ వారు చెప్పిందే శాసనం. ఎన్నిక ప్రక్రియ వచ్చే సరికి ఆ గ్రామాల్లో ఏకపక్షంగానే సాగేవి. ప్రత్యర్థి వర్గానికి చెందిన వారు ఏజెంట్లను కూడా కూర్చోబెట్టేందుకు సాహసించరు. ఓటర్లు కూడా స్వచ్ఛందంగా ఓట్లు వేసేవారు కాదు. ఆ గ్రామాల్లో ప్రతిసారీ దాదాపుగా 98 శాతం ఓట్లు ఓకే పార్టీకి పడేవి. దీనికి భిన్నంగా ఈసారి స్వేచ్ఛాపతాకం ఎగిరింది. ప్రజాస్వామ్యబద్ధంగా పోలింగ్ ప్రక్రియ జరిగింది.

సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ వ్యూహంతో ముందుకెళ్లారు. నియోజకవర్గంలోని మైదుకూరు, చాపాడు, దువ్వూరు, ఖాజీపేట, బి.మఠం మండలాల్లోని 27 సమస్యాత్మక, ఏకపక్ష గ్రామాలు ఉన్నట్లు గుర్తించారు. ఆ గ్రామాల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో పోలింగ్ జరిగేలా చూడాలనుకున్నారు. ఇందుకోసం ఆ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో తమ పార్టీ తరుపున ఏజెంట్లను కూర్చోబెట్టాలని నిర్ణయించుకున్నారు. ఆ 27 గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టి కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని, ఓటర్లకు భద్రత కల్పించాలని ఎన్నికల సంఘంతో పాటు జిల్లా ఎన్నికల నిర్వహణాధికారికి వినతి పత్రాలు అందచేశారు. ఈ మేరకు ఆయా సమస్యాత్మక గ్రామాల్లో అధికారులు కట్టుదిట్టమైన భద్రత కల్పించడంతో ఏజెంట్లను కూడా కూర్చోబెట్టగలిగారు. దీంతో ఆ గ్రామాల్లో ఓట్లు వేయడానికి గ్రామస్తులు కూడా ఆసక్తి కనబరచి తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకున్నారు. అయితే చాపాడు మండలం చిన్నగులువలూరు పోలింగ్‌కేంద్రంలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తన అనచరులతో టీడీపీ ఏజెంట్లను బయటకు లాగి దాడిచేసి తీవ్రగాయాలు పాలు చేశారు. పోలీసులు అప్రమత్తం కావడంతో మిగిలిన పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సాఫీగా సాగింది.





మైదుకూరు మండలం నంద్యాలంపేట పోలింగ్ కేంద్రం(118)లో బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

సమస్యాత్మక, ఏకపక్ష గ్రామాల్లో.. ప్రజాస్వామ్యబద్ధంగా పోలైన ఓట్లు

- ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి స్వంత గ్రామం చాపాడు మండలం నక్కలదిన్నె (పీయస్ 142)లో మొత్తం 1124 మంది ఓటర్లుండగా 977 మంది ఓట్లేశారు.
- కుచ్చుపాప (పీయస్ 144)లో 519 మంది ఉండగా, 476 పోల్ అయ్యియి
- కేతవరం (166)లో 930కి గాను 855 మంది ఓట్లేశారు.
- నర్రవాడ(160)లో 490కి గాను 462 పోల్ అయ్యాయి.
- చిన్నగులువలూరు(167, 168)లో 1082కు గాను 901 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.
- పెద్దగులువలూరు (169)లో 964 మందికి గాను 834 పోల్ అయ్యాయి.
- ఓబుల్‌రెడ్డిపేట (170)లో 503మంది ఓటర్లుండగా 468 మంది ఓట్లు వేశారు.
- ఖాజీపేట మండలం శాంతినగరం(180)లో 232 మందిలో 189మంది ఓట్లు వేశారు.
- నందిపాడు(201)లో 849కి గాను 733 మంది ఓట్లు వేశారు.
- దుంపలగట్టు(208)లో 1120లో 1036 పోల్ అయ్యాయి.
- టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ స్వగ్రామం బ్రహ్మంగారి మఠం మండలం కొత్తపల్లె(258)లో 273 మందిలో 254 ఓట్లు పోల్ అయ్యాయి.
- నరసన్నపల్లి(243,244,245)లో 1624 మందిలో 1240 మంది ఓట్లు వేశారు.
- చెంచయ్యగారిపల్లె(251)లో 1125కు గాను 998 పోల్ అయ్యాయి.
- దువ్వూరు మండలం పుల్లారెడ్డిపేట(26)లో 594లో 482 పోల్ అయ్యాయి.
- గొల్లపల్లె(32)లో 608లో 560 పోల్ అయ్యాయి.
- మీర్జాఖాన్‌పల్లె(54)లో 867కు గాను 788 పోల్
- రామాపురం(55)లో 522కు గాను 502 మంది తమ ఓటు హక్కు వినియోగించారు.
- మైదుకూరు మండలంలోని వనిపెంట(64, 65)లో 1479 మందిలో 1305 మంది ఓట్లు వేశారు.
- మైదుకూరులోని అనకుంట(84,92)లో 1500 మందిలో 1193 పోల్ అయ్యాయి.
- మూలబాట (86,87,88, 89)లో 3,904 మందికి గాను 3163 మంది ఓట్లు వేశారు.
- జడ్పీ హైస్కూల్(100,104,105,106)లో 4,478 మందిలో 3,589 మంది ఓట్లు వేశారు.
- బండివారిపల్లె(81)లో 574లో 536 పోల్ అయ్యాయి.
- చిన్నయ్యగారిపల్లె(113)లో 728లో 643 మంది ఓట్లు వేశారు.
- నంద్యాలంపేట(118)లో 1072 ఓట్లు ఉండగా, 833 మంది ఓట్లు వేశారు.
- యన్ ఎర్రబల్లె (123)లో 760కి గాను 715 పోల్ అయ్యాయి.
- గొల్లపల్లె (80)లో 392కు గాను 353 పోల్ అయ్యాయి.
- జాండ్లవరం(126)లో 745కి గాను 670 పోల్ అయ్యాయి.

50 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు మంజూరు

కడప(రూరల్) మే 16: కడప మండలానికి 50 క్వింటాళ్ల జీలగ విత్తనాలు మంజూరయ్యాయని... జీలుగ విత్తనాలు కావలసిన రైతులు శుక్రవారం నుంచి తమ వివరాలను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వరి సాగు చేసే రైతులు ఆధార్‌కార్డు, ఫోన్ నెంబర్ తీసుకుని వ్యవసాయశాఖ సిబ్బందిని సంప్రదించి రైతు వాటా చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు. జీలుగ విత్తనాలు ఒక ఎకరాలకు 10 కిలోల చొప్పున గరిష్టంగా 50 కిలోల వరకు ఇవ్వడం జరుగుతుందన్నారు. 10 కేజీల బ్యాగు పూర్తి ధర రూ.880లు కాగా 50 శాతం సబ్సిడీ పోను రూ.440లు రైతు వాటాగా చెల్లించాలన్నారు.

వీరపునాయునిపల్లె : మండలంలో వరిసాగు చేసే రైతులకు 50శాతం సబ్సిడీతో పచ్చి రొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి శ్యామ్‌బాబు తెలిపారు. అనిమెల రైతు భరోసా కేంద్రంలో జరుగుతున్న పచ్చిరొట్ట విత్తన నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. మండలానికి 20 క్వింటాళ్ల జీలుగలు, 4 క్వింటాళ్ల పిల్లిపెసర విత్తనాలు మంజూరయ్యాయన్నారు. కావాల్సిన రైతులు ఆర్బీకే సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు

సింహాద్రిపురం, మే 16: మండలంలోని అంకాళమ్మగూడూరులో పోతులూరి వీరబ్రంహేంద్రస్వామి ఆరాధన మహోత్సవం శుక్ర, శనివారం రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు శ్రీనివాసులు తెలిపారు. 17వ తేదీ ఉదయం 7 గంటల నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం, తాళాల భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు. రాత్రి 8 నుంచి నంద్యాల గౌతమి బృందంచే వీరబ్రంహేంద్రస్వామి జీవిత చరిత్ర నాటకం ఉంటుందన్నారు. 18వ తేదీ ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, భజన బృందాలకు పోటీలు, అన్నదాన కార్యక్రమం, రాత్రి 8 గంటలకు సాసవల చిన్నమ్మ కథ, భక్తిరస నాటక ప్రదర్శన ఉంటుందన్నారు.

గొడవలు పెట్టుకుంటే నాన్ బెయిలబుల్ కేసులు : సీఐ

చక్రాయపేట, మే 16: గొడవలు పెట్టుకొని కొట్టుకునే వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని ఆర్కేవ్యాలీ సీఐ గోవిందరెడ్డి గురువారం హెచ్చరించారు. ఎన్నికల తర్వాత రాష్ట్రంలో జరుగుతున్న పోస్ట్ పోల్ సంఘటనలను దృష్టిలో పెట్టుకొని ఎవరైనా అలజడులు సృష్టిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఎంతటివారినైనా ఉపేక్షించమన్నారు. రౌడీషీట్స్ కూడా ఓపెన్ చేసి మండల, జిల్లా బహిష్కరణ చేస్తామన్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని, గొడవలు పెట్టుకోవద్దన్నారు.

లాసెట్‌పై 19న అవగాహన తరగతులు

ప్రొద్దుటూరు టౌన్, మే 16: లాలో చేరాలనుకునే విద్యార్థులకు ఈ నెల 19వ తేదీ ఒక రోజు లాసెట్‌పై అవగాహన తరగతులు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు జేవీవీ అధ్యక్షుడు శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి సునీత తెలిపారు. నందిని క్లాత్ మార్కెట్‌లోని జేవీవీ కార్యాలయంలో 19వ తేదీ ఉదయం 11 గంటల నుంచి శిక్షణ తరగతులు ప్రారంభం అవుతాయని, నిపుణులు ఆప్టిట్యూడ్, జనరల్ న్యాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ గురించి బోధిస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

సమస్యలుంటే తెలియచేయాలి

మైదుకూరు, మే 16: రాష్ట్రంలో జరుగుతున్న పోస్ట్‌పోల్ సంఘటనలు దృష్టిలో పెట్టుకుని ఎన్నికలకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే తమకు తెలియచేయాలని అర్బన్ సీఐ మస్తాన్ పేర్కొన్నారు. ఎవరైనా గొడవలకు గానీ, లేదా ఘర్షణలకు పాల్పడితే వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని, అవసరమైతే రౌడీ షీట్ కూడా ఓపెన్ చేసి బహిష్కరణ కూడా ఉంటుందని తెలిపారు. సమస్యలుంటే తెలియచేయాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

ఉత్సాహంగా సాగుతున్న సమ్మర్ క్యాంప్



ప్రొద్దుటూరులో గణితం బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

ప్రొద్దుటూరు టౌన్, మే 16: గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ ఉత్సాహంగా సాగుతోంది. గురువారం రామేశ్వరంలోని బాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో వసంతపేట మున్సిపల్ హైస్కూలులో సమ్మర్ క్యాంప్ నిర్వహించారు. గణిత ఉపాధ్యాయురాలు నిర్మలాజ్యోతి అంకెలు, సంఖ్యలు, కూడికలు, బాగహారం, గుణకారం, స్థాన విలువలు, వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. రచయిత జింకా సుబ్రహ్మణ్యం విద్యార్థులకు వేమన పద్యాలను బోధించి వాటి బావాన్ని తెలిపారు. అనంతరం విద్యార్థులకు క్యారెంబోర్డు, చెస్ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రహింసాహెబ్, శారద, రవిబాబు, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాన్ని ఉపయోగించుకోవాలి

కొండాపురం, మే 16: స్థానిక గ్రంథాలయంలో గురువారం నుంచి ప్రారంభమైన వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు ఉపయోగించుకోవాలని లైబ్రేరియన్ వరలక్ష్మి కోరారు. జూన్ 7 వరకు ఈ తరగతులు కొనసాగుతాయన్నారు. విద్యార్థులకు డ్రాయింగ్, కథలు, పద్యాలు చెప్పించడం, ఇంగ్లీష్ గ్రామర్, పేపర్ క్రాఫ్ట్ వంటి కృత్యా లను నేర్పిస్తారన్నారు. కార్యక్రమంలో అమీరుద్దీన్ పాల్గొన్నారు.

సమస్యలు తీరేదెప్పుడో...

● మండల వ్యాప్తంగా తిష్టవేసిన సమస్యలు ● పట్టించుకోని పాలకులు, అధికారులు

చెన్నూరు, మే 16: మండలంలో గత ఐదేళ్లుగా సమస్యలు తిష్టవేశాయి. వాటిని పరిష్కరించే దిశగా పాలకులు, అధికారులు కృషి చేయకపోవడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు, మురికినీటి కాల్వలు, రక్షణ కట్టలు ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతి పంచాయతీలోనూ సమస్యలే ఉన్నాయి. మండల కేంద్రమైన చెన్నూరులో పెన్నాతీరం వెంబడి



ట్రాఫిక్ సమస్య తీరాలంటే వేయాల్సిన కేసీ కెనాల్ ఆయకట్టు రోడ్డు

రక్షణ కట్ట పలుచోట్ల కోతకు గురై దెబ్బతింది. ముఖ్యంగా హైవే పెన్నానది వంతెన నుంచి చెన్నూరు కొండపేట వంతెన వరకు నదీ తీరం వెంబడి రక్షణ కట్టలో రాళ్లు పూర్తిగా కొట్టుకుపోవడంతో మట్టి కట్ట అంతా వరద నీరు వచ్చినప్పుడల్లా కోతకు గురవుతుంది. ఎన్నో దశాబ్దాలుగా ఈ రక్షణ కట్ట పనులు చేపట్టకపోవడంతో క్రమేపీ కోతకు గురై చివరికి నివాస గృహాలు ఉండే వరకు మట్టి కొట్టుకుపోయింది. బలసింగాయపల్లె పంచాయతీ పరిధిలోని దౌలతాపురం ఎస్టీ కాలనీ నుంచి ఎస్టీ రామాపురం కాలనీ వరకు గతంలో పీఎంజీఎస్‌వై కింద కోటికి పైగా నిధులతో వేసిన తారురోడ్డు జగనన్న కాలనీకి మెటీరియల్ తీసుకువెళ్లే టిప్పర్ల పుణ్యమా అని రెండు కి.మీ మేర పూర్తిగా తారురోడ్డు ధ్వంసమై కంకర తేలి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ రహదారిలో రాత్రివేళ ప్రయాణించే వారు ప్రమాదవాలకు గురవుతున్నారు. కొక్కిరాయపల్లె రోడ్డు ఏ కారణం చేతనో గానీ కొంత వరకే రోడ్డు వేయగా మిగిలిన రోడ్డంతా గుంతలమయమైంది. రాచిన్నాయపల్లెలో రూ.26 కోట్లతో ముండ్లపల్లె, ఓబులంపల్లె, రామనపల్లె, రాచిన్నాయపల్లె గ్రామాలకు కలుపుతూ ఇటు పాలెం పల్లె అటు దేవునికడప ఆర్చి వరకు వేయాల్సిన రోడ్డు, వంతెన కల్వర్టులు కేవలం ఐదు శాతం కూడా పూర్తి కాని పరిస్థితి. ఏదో తూతూ మంత్రంగా నిధులు ఇస్తామని చెప్పినా కూడా అది కూడా ఇవ్వకుండా చేతులు ఎత్తేయడంతో కాంట్రాక్టరు పూర్తిగా పనులు ఆపివేశారు. వీటికి తోడు చిన్నమాచుపల్లె హైవే నుంచి రామనపల్లె వరకు తారురోడ్డు కనీసం



గుంతలమయంగా మారిన రాచిన్నాయపల్లె-పాలెంపల్లె రోడ్డు

మరమ్మతులకు కూడా నోచుకోక గుంతలమయమైంది.

మండల కేంద్రమైన చెన్నూరులో టెండరు నిర్వహించి కొంతమేర 20 అడుగుల వెడల్పుతో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ వేశారు. మిగిలిన రోడ్డు అలాగే వదిలేశారు. అధిక జనాభా గల ఈ పంచాయతీలో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. ఎదురుగా వాహనం వస్తే ముందు ఉండే వాహనం ఆగాల్సిన పరిస్థితి నెలకొంది. ఇందుకు పరిష్కారంగా కేసీ కాల్వ పక్కన ఉండే మట్టి కట్ట సిమెంటు రోడ్డుగా మారిస్తే ప్రయోజనమని గత ఐదేళ్లుగా ప్రజలు నెత్తి నోరు కొట్టుకున్నా ఆ పని చేయకుండా కాలం గడిపేశారు. ఈ రోడ్డు పూర్తయితే తప్ప చెన్నూరు పంచాయతీలో రాకపోకల సమస్యలు తీరే పరిస్థితి లేదు. కావున ఈ సమస్యలను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశాంత ఓటింగ్‌పై సర్వత్రా హర్షం

స్వేచ్ఛాయుతంగా ఓటు వినియోగించుకున్నామంటూ ఓటర్లలో ఆనందం

పులివెందుల రూరల్, మే 16: పులివెందులలో ప్రశాంతంగా ఓటింగ్ జరగడంపై అన్ని వర్గాలు వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఉదయం 6 నుంచి రాతి 9గంటల వరకు ఓటింగ్ సాగింది. అంత సమయం ఓటింగ్ సాగినప్పటికి పులివెందులలో ఎన్నికలు ప్రశాంతంగా జరగడంపై ప్రతి ఒక్కరూ ఆనందంతో పాటు ఆశ్చర్యం వెలిబుచ్చుతున్నారు. వేముల మండలం మబ్బు చింతలపల్లెలో రాళ్లదాడులు, వేంపల్లె పట్టణంలో టీడీపీ ఏజెంట్‌పై దాడి జరిగిన ఘటనలు మినహా చెప్పుకోనేస్థాయి గొడవలు ఏవీ జరగకుండా ప్రశాంతంగా ఓటింగ్ ముగిసింది. రీ పోలింగ్‌కు కూడా ఎక్కడ అవకాశం లేకుండా ఎన్నికల కమిషన్, పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

లింగాల, పులివెందుల తదితర మండలాల్లో గతంలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుంటూ ఉండేవి. కానీ ఈ ఎన్నికల్లో ఎక్కడ ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకపోవడం శుభపరిణామంగా పేర్కొంటున్నారు. ఈ ఎన్నికల్లో తమ



పులివెందులలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు (ఫైల్‌ఫొటో)

ఇష్టమైన నాయకులకు ఓటు హక్కు వినియోగించుకునే వెసులుబాటు కలిగిందని ఓటర్లు అంటున్నారు. పులివెందుల పట్టణంలో కూడా ఎక్కడ చిన్న ఘర్షణ కూడా తావులేకుండా పోలీసులు ఎప్పటికప్పుడు అప్రమత్తమవుతూ ఓటింగ్‌లో ప్రశాంత వాతావరణాన్ని కల్పించారు. ముఖ్యంగా నియోజకవర్గంలోని లింగాల మండలంలో కొన్ని గ్రామాల్లో ప్రశాంత ఓటింగ్ జరగకపోవచ్చని అందరు భావించారు. కానీ వాటికి భిన్నంగా ఓటింగ్ జరగడం ఒకింత ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. అక్కడ టీడీపీకి ఏజెంట్లు లేరని, ఉన్నా అక్కడ ఉండడం కష్టమని అందరు భావించారు. కానీ నియోజకవర్గంలో ప్రతి పోలింగ్ కేంద్రంలో టీడీపీ ఏజెంట్లను నిలిపి చివరి వరకు ప్రశాంత ఓటింగ్ జరిగేలా చూడడం కొసమెరుపు.

పేదల సొమ్ము కాంట్రాక్టర్లకు చెల్లించేందుకు యత్నాలు

● టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి

కడప, మే 16 (ఆంధ్రజ్యోతి): పేదలకు చెల్లించా ల్సిన సొమ్మును తమ కాంట్రాక్టర్లకు చెల్లించేం దుకు ముమ్మరంగా సన్నాహాలు చేస్తున్నారని టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి వైసీపీ ప్రభుత్వ తీరుపై విమర్శించారు. గురు వారం ఆయన టీడీపీ కార్యాలయంలో మాట్లాడు తూ ఎన్నికలు ముగిసి మూడు రోజులవుతోంది. అయినా ఇంత వరకు బటన్ నొక్కుడు డబ్బులు ఇంకా పేదల ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం జమ చేయలేదన్నారు. రూ.14465 కోట్లను కాంట్రాక్టర్లకు చెల్లించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అప్పుడెప్పుడో జనవరి నుంచి మార్చిలో ఎన్నికల కోడ్ వచ్చే వరకు నొక్కిన బటన్ల డబ్బులు ఎన్నికలకు రెండు రోజుల ముందు జమచేయాలని ప్రయత్నించారన్నారు. మే 11 నుంచి మే 13 వరకు డబ్బులు వేయొద్దని, ఎన్నికల తర్వాత ఎప్పుడైనా జమచేయొచ్చని కోర్టు తీర్పుతో ఎన్నికల సంఘం అనుమతిచ్చిందన్నారు. కానీ ఇప్పుడు జమ చేయకపోగా ప్రతిపక్ష నాయకులు అడ్డుకున్నారని. ఎవరో కుట్ర చేసి పేదల పక్షాన నిలివచేవారికి అడ్డుగా నిలుస్తున్నారంటూ నానా యాగీ చేశార న్నారు. వాస్తవానికి ఆసరా పథకం జనవరి 23న, కళ్యాణమస్తు ఫిబ్రవరి 28న, విద్యాదీవెన మార్చి 1న, పెట్టుబడి రాయితీ మార్చి 6న, చేయూత మార్చి 7న, ఈబీసీ నేస్తం మార్చి 14న బటన్లు నొక్కారన్నారు. కానీ మే 11వరకు కనీసం ఆ సొమ్ములు జమ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఏరోజూ ఆలోచన చేయలేదన్నారు. మే 9న హైకోర్టు తీర్పు వచ్చినపుడు తెల్లారేసరికి డబ్బులు పడిపోవాలంటూ సీఎస్ జవహర్‌రెడ్డి, ఆర్థికశాఖ అధికారులు హడావుడి చేశారన్నారు. బడ్జెట్ లేదు, బీఆర్వోలు లేవు, తాము చేయలేమంటూ అధికారులు అడ్డం తిరిగిన రూ.9600కోట్లు జమ చేసేందుకు ప్రయత్నించి ఏర్పాట్లు చేశారన్నారు. ఇపుడు ఎన్నికలు అయిపోయాయి. డబ్బు జమ చేసినా రాజకీయంగా వచ్చే ప్రయోజనం లేదని గుర్తించి పైగా మళ్లీ గెలిచే అవకాశాలు లేకపో వడంతో సొంత వారికి దోచిపెట్టేందుకు సన్నా హాలు చేసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గోవర్ధన్‌రెడ్డి

క్షయవ్యాధి నిర్మూలనకు టీకాలు వేయించుకోవాలి

పులివెందుల రూరల్, మే 16: 18-60ఏళ్ల పైబడి న ప్రతి ఒక్కరు క్షయవ్యాధి నిర్మూలనకు టీకా వేయించుకోవాలని తొండూరు పీహెచ్‌సీ డాక్టర్ రేష్మ తెలిపారు. గురువారం తొండూరు పీహెచ్‌సీ పరిధిలో షుగర్ వ్యాధిగ్రస్తులకు, ధూమపానం చేసే వారికి బీసీజీ టీకా వేశారు. డాక్టర్ రేష్మ మాట్లాడుతూ బీసీ టీకా ప్రతి గురువారం వేస్తా రని, క్షయవ్యాధి నిర్మూలనకు టీకా వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ ఓ రమణమ్మ, హెచ్‌ఈ మల్లయ్య, సూపర్‌వైజర్ శశికళ, సిబ్బంది పాల్గొన్నారు.

లింగాల : మండలంలోని అంగన్వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలలో గురువారం క్షయవ్యాధి నివార ణకు టీకా వేశారు. ఈ కార్యక్రమం ప్రతి నెల అన్ని సచివాలయాల పరిధిలో గురువారాల్లో జరుగుతుందని, సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కళ్యాణ్ దినకర్ తెలిపారు. సీహెచ్‌ఓ శివరామ్, పీహెచ్‌ఎన్ కుసుమకుమారి, ఏఎన్ ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వేంపల్లె : అన్ని సచివాలయాల పరిధిలో ప్రతి గురువారం నిర్వహించే అడల్ట్ బీసీజీ వ్యాక్సి నేష న్‌ను వినియోగించుకోవాలని డాక్టర్ ఎన్ఆర్ స్వాతిసాయి సూచించారు. తాళ్లపల్లె పీహెచ్‌సీ పరిధిలోని 8వ సచివాలయం అయిన రాజీవ్ కాలనీలో అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ 18 నుంచి 60ఏళ్ల పైబడిన వారికి క్షయవ్యాధి రాకుండా మరియు వ్యాధి వ్యాపించకుండా ప్రభుత్వం పొగతాగే వారికి, క్షయవ్యాధి గ్రస్తులున్న కుటుంబ సభ్యులకు, 60ఏళ్ల పైబడిన వారికి, ఓల్డ్ టీబీ వ్యాధి



తొండూరులో బీసీజీ టీకా వేస్తున్న సిబ్బంది

గ్రస్తులకు (ఐదేళ్ల చికిత్స పూర్తయిన వారు) వ్యాక్సినేషన్ జరుగుతుందన్నారు. దీంతో ప్రతి గురువారం అన్ని సచివాలయాల పరిధిలో వ్యాక్సి నేషన్ కార్యక్రమం ఉంటుందన్నారు. డాక్టర్ నిజాముద్దీన్, సూపర్‌వైజర్లు, సీహెచ్‌ఓలు, ఏఎన్ ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

దోమల వల్ల వ్యాపించే వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి



నల్లపురెడ్డిపల్లెలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పులివెందుల రూరల్, మే 16: దోమల వల్ల వ్యాపించే వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య ప్రజలకు సూచించారు. గురువారం మండలంలోని నల్లపురెడ్డిపల్లెలో జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ ప్రాణాంతక వ్యాధి అని.. దోమల వలన వ్యాపిస్తుందన్నారు. ఈవ్యాధి నియంత్రణ మన చేతుల్లో ఉంటుందన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, ఇంటి ఆవరణలో ఉన్న నీటి నిల్వ పాత్రలను, తొట్లను, పాత టైర్లను, వేస్ట్ ప్లాస్టిక్ గ్లాసుల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

జీలుగల పంపిణీ పరిశీలన



జీలుగల పంపిణీని పరిశీలిస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి

కమలాపురం రూరల్, మే 16: మండల పరిధిలోని గంగవరం గ్రామంలో చేపట్టిన పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఏడీఏ నరసింహారెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి సాగుచేసే రైతులకు మండలానికి 50 క్వింటాళ్ల జీలుగలు విత నాలు, 4క్వింటాళ్ల పిల్లిపెసర విత్తనాలు మంజూరయ్యాయని, కావాల్సిన రైతులు మీ దగ్గరలోని రైతు భరోసా కేంద్రాలను సంప్రదించి తీసుకెళ్లాలన్నారు. జీలుగలు సాగుచేసుకోవడం వలన నేలలో సేంద్రీయ, కార్బనం పెరుగుతుందన్నారు. నేలకు నత్రజని, బాస్వరం, పొటాష్, సూక్ష్మపోషకాలు ఉంటాయన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారి దస్తగిరి, గ్రామ వ్యవసాయ సహాయకులు వెంకటకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు పుస్తక పఠనం అలవరుచుకోవాలి

పోరుమామిళ్ల, మే 16: వేసవి సెలవుల్లో విద్యార్థులు గ్రంథాల యంలో పుస్తకపఠనం అలవరుచుకుని విజ్ఞానవంతులు కావాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యవర్గ సభ్యులు దాదాపీర్, గ్రంథా లయ అధికారి అఫ్రిద్ పేర్కొన్నారు. గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించిన వారు మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవుల్లో పుస్తకపఠన అభిలాషను పెంపొందించుకో వాలన్నారు. దినపత్రికలు, వారపత్రికలు, మహానుభావుల జీవిత చరిత్రలు, కథలు, పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు. జూన్ 7 వరకు గ్రంథాలయంలో విజ్ఞానశిబిరాన్ని కొనసాగిస్తున్నామన్నారు. గఫార్, హాసిమ్‌వల్లి, మహమ్మద్‌రఫి పాల్గొన్నారు.

విషపురుగు కుట్టి ఆవు మృతి

పోరుమామిళ్ల, మే 16: విషపురుగు కుట్టడంతో ఆవు మృతి చెందిం ది. బలిజకోట వాసి సిద్దయ్య ఆవు కు విషపురుగు కుట్టి నట్లు పంచాయితీ అధికారులకు తెలప డంతో సర్పంచ్ య నమల సుధాకర్ ఆదేశాల మేరకు పంచాయితీ కార్యదర్శి వెంకట సుబ్బయ్య సిబ్బందితో వెళ్లి ఖననం చేయించారు.

జాతీయ రహదారిపై స్పీడ్ బ్రేకర్లు

● ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
● పట్టించుకోని అధికారులు

సికెదిన్నె, మే 16: కడప-రాయచోటి ప్రధాన జాతీయ రహదారిలో రవాణాశాఖ కార్యాలయం ఎదురుగా అధికారులు హడావుడిగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. అయితే ఇక్కడ ఎటువంటి సిగ్నల్స్ ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు స్పీడ్ బ్రేకర్లను గుర్తించక సడన్‌గా బ్రేకులు వేయడంతో వెనుకవైపు వచ్చేవాహనాలు ఢీకొనడం లాంటి సంఘటనలు అనేకం జరిగాయి. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. జాతీయ రహదారిలో నిబంధనలకు విరుద్ధంగా స్పీడ్ బ్రేకర్లు అడ్డదిడ్డంగా వేయడం వలన ప్రమాదాలు సంభవిస్తున్నాయని, స్పీడ్ బ్రేకర్లు తొలగించి ప్రమాదాలను అరికట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు. మరోవైపు స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయడంతో ఇక్కడ కొందరు ట్రాన్స్ జండర్స్ వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నారని చెబుతున్నారు.

డ్రైజలర్స్ ఏర్పాటు చేయాలి

● ఉప రవాణా కమిషనర్ మీరాప్రసాద్

జాతీయ రహదారిపై వాహనదారులు వేగాన్ని నియంత్రించేందుకు డ్రైజలర్స్ ఏర్పాటు చేయాలని సూచించాం. అయితే జాతీయ రహదారుల అధికారులు స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేశారు. దీంతో వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్న విషయం మా దృష్టికి కూడా వచ్చింది. ఉన్నతాధికారులతో సంప్రదించి వాహనదారుల ఇబ్బందులను తొలగిస్తాం.



ఉపరవాణా కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన స్పీడ్‌బ్రేకర్ వద్ద వాహనాలు

ప్రహరీ ఏర్పాటు చేయరా...?

మొండిగోడలతో తహసీల్దారు కార్యాలయం ● ఆవరణలో మట్టి కుప్పలు, తోపుడు బండ్లు సిబ్బందికి, ప్రజలకు తప్పని ఇబ్బందులు ● రెండేళ్లగా సమస్య పట్ల అధికారుల నిర్లక్ష్యం

జమ్మలమడుగు, మే 16: జమ్మలమడుగు డివిజన్ కేంద్రమైన తహసీల్దారు కార్యాలయం సమస్యల నీడలో కొట్టుమిట్టాడుతోంది. రెండేళ్లగా అధికారులు ప్రహరీ నిర్మించకుండా నిర్లక్ష్యంగా వదిలేశారని విమర్శలు వినపడుతున్నాయి. తహసీల్దారు కార్యాలయం ఆవరణంలో కార్యాలయం వద్దకు వివిధ సమస్యలపై వచ్చే ప్రజలకు, సిబ్బందికి, ద్విచక్ర వాహనాలు పెట్టుకోవడానికి దారిలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆవరణంలోనే పెన్షనర్స్ భవనం పక్కన దారి ఉంది. దాని పక్కన కొందరు వ్యాపారులు ఆక్రమించారని ఆరోపణలున్నాయి. అక్కడ రెండేళ్ల కిందట రెవెన్యూ అధికారులు ఎర్రమట్టి కుప్పలు పోసి ఎవరూ రాకుండా చేసినా వ్యాపారులు ఆ స్థలంలో దర్జాగా ఉన్నట్లుగా


అలంకారప్రాయంగా ప్రహరీ సిమెంటు దిమ్మెలు


సబ్‌జైలు పక్కన ఆక్రమణలో మట్టి కుప్పలు, దుకాణాలు

స్థానికులు విమర్శలు చేస్తున్నారు. ప్రభుత్వ స్థలంలో తహసీల్దారు కార్యాలయానికి ప్రహరీ కట్టకుండా కొందరు అడ్డుపడ్డారని, అప్పట్లో సమస్య దుమారం లేచింది. వైసీపీ నేతలే అడ్డుపడినట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా తహసీల్దారు కార్యాలయ సిబ్బంది, పాత పోలీసు స్టేషన్ ఖాళీ కావడంతో ఆ దారిలో వెళ్లి వెనుకవైపు నుంచి ఖాళీ స్థలంలో వాహనాలు పెట్టుకుంటున్నట్లు వారు తెలిపారు. ఇంత సమస్య ఉన్నా డివిజన్ కేంద్రంలోనే కార్యాలయానికి ప్రహరీ లేక సమస్యల నడుమ ఉన్నా అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శలు వినపడుతున్నాయి. ఇప్పటికైనా ఆ సమస్యకు పరిష్కారం ఎన్నడు దొరుకుతుందోనని పలువురు వాపోతున్నారు.

కాల్వల్లో మురుగు తొలగింపు

స్పెషల్ డ్రైవ్ పెట్టిన శానిటరీ అధికారులు

ప్రొద్దుటూరు, మే 16: ప్రజా ఆరోగ్య శాఖకు అనారోగ్యం పేర గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై శానిటేషన్ అధికారులు స్పందించారు. శ్రీనగర్ కాలనీ జంగంపేట ఏరియాలో గురువారం సాయంత్రం గ్రూప్ వర్కర్లతో స్పెషల్ డ్రైవ్ పెట్టి కాల్వలను శుభ్రం చేయించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్‌బాషా, శానిటరీ సెక్రటరీ సంజీవ్ ఆధ్వర్యంలో పనులు పర్యవేక్షించారు. ఈ వార్డుకు వర్కర్లు తక్కువ వున్న మాట వాస్తవమని త్వరలో తగినంత మంది వర్కర్లను కేటాయించేలా కమిషనర్ రఘునాధరెడ్డితో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇప్పటి నుంచి వార్డుల్లో ప్రతి వారం కాల్వలు శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.


కాల్వలు శుభ్రం చేయిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్

నీటి వృథాపై హెచ్చరిక

ప్రొద్దుటూరు టౌన్, మే 16: కొత్తపల్లె పంచాయతీలో మంచి నీరు వృథా చేయడంపై కొత్తపల్లె పంచాయతీ కార్యదర్శి సురేష్‌కుమార్ హెచ్చరికలు జారీ చేశారు. గురువారం ప్రచురితమైన 'మౌలిక వసతులు కరువు' కథనంపై స్పందించిన ఆయన సిబ్బందితో కలిసి పంచాయతీలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కానపల్లెలో మడూరు కాల్వ నుంచి దుర్వాసన, దోమల బెడద ఎక్కువని ప్రజలు తెలిపారు. గ్రామంలో కుళాయి ద్వారా మంచినీటినీ, పూలు, పండ్లు, కూరగాయల సాగుకు వినియోగిస్తుండడాన్ని గుర్తించి యజమానులను హెచ్చరించారు. మంచినీటిని తాగేందుకు ఉపయోగించాలని, ఇతర అవసరాలకు వినియోగిస్తే కనెక్షన్ తొలగిస్తామని హెచ్చరించారు. గ్రామంలో కుళాయి నీటిని తోటల పెంపకానికి ఉపయోగించకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.


హోటల్ యజమానులను హెచ్చరిస్తున్న దృశ్యం

లాసెట్‌పై 19న అవగాహన తరగతులు

ప్రొద్దుటూరు టౌన్, మే 16: లాలో చేరాలనుకునే విద్యార్థులకు ఈ నెల 19వ తేదీ ఒక రోజు లాసెట్‌పై అవగాహన తరగతులు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు జేవీవీ అధ్యక్షుడు శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి సునీత తెలిపారు. నందిని క్లాత్ మార్కెట్‌లోని జేవీవీ కార్యాలయంలో 19వ తేదీ ఉదయం 11 గంటల నుంచి శిక్షణ తరగతులు ప్రారంభం అవుతాయని, నిపుణులు ఆప్టిట్యూడ్, జనరల్ న్యాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ గురించి బోధిస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

సమస్యలుంటే తెలియచేయాలి

మైదుకూరు, మే 16: రాష్ట్రంలో జరుగుతున్న పోస్ట్‌పోల్ సంఘటనలు దృష్టిలో పెట్టుకుని ఎన్నికలకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే తమకు తెలియచేయాలని అర్బన్ సీఐ మస్తాన్ పేర్కొన్నారు. ఎవరైనా గొడవలకు గానీ, లేదా ఘర్షణలకు పాల్పడితే వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని, అవసరమైతే రౌడీ షీట్ కూడా ఓపెన్ చేసి బహిష్కరణ కూడా ఉంటుందని తెలిపారు. సమస్యలుంటే తెలియచేయాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

విషపురుగు కుట్టి ఆవు మృతి

పోరుమామిళ్ల, మే 16: విషపురుగు కుట్టడంతో ఆవు మృతి చెందింది. బలిజకోట వాసి సిద్దయ్య ఆవుకు విషపురుగు కుట్టినట్లు పంచాయతీ అధికారులకు తెలపడంతో సర్పంచ్ యనమల సుధాకర్ ఆదేశాల మేరకు పంచాయితీ కార్యదర్శి వెంకటసుబ్బయ్య సిబ్బందితో వెళ్లి ఖననం చేయించారు.


ఆవును పూడ్చుతున్న పంచాయతీ సిబ్బంది

క్షయ నివారణకు వ్యాక్సిన్ తప్పనిసరి

ప్రొద్దుటూరు, మే 16: క్షయ నిర్మూలనకు బీసీజీ టీకా వేయించుకోవాలని వైద్యాధికారి శివప్రసాద్ తెలిపారు. స్థానిక బాహూజీ నగర్ కెహెచ్ఎం వీధి సచివాలయాల్లో వయోజన బీసీజీ టీకాను వైద్య సిబ్బంది ఏర్పాటు చేశారు. ప్రతి గురువారం అంగన్‌వాడీ కేంద్రాల్లో క్షయ నిర్మూలన చేసేందుకు ఈ టీకా అందుబాటులో వుంటుందన్నారు. పెద్ద వయస్సు వున్న వారికి ఈ టీకా ఇవ్వడం ద్వారా కొత్త కేసులు సంఖ్య తగ్గించేందుకు వినియోగపడుతుందన్నారు. ఐదేళ్లలో క్షయ గ్రస్తులకు, వ్యాధి కేసులున్న కుటుంబ సభ్యులకు బాడీ మాస్ ఇండెక్స్ 18 కన్నా తక్కువ వున్నవారికి ధూమపానం మద్యపానం అలవాటు వున్నవారికి మధుమేహం వ్యాధి వున్న వారికి ఈ టీకాలు తప్పని సరి ఇవ్వాలన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం సునీత, రాజేశ్వరి ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

తొట్టిగారిపల్లెలో....

బద్వేలు, మే 16: క్షయ నివారణకు బీసీజీ వ్యాక్సిన్ తప్పనిసరి అని జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రమేష్ పేర్కొన్నారు. తొట్టిగారిపల్లెలో నిర్వహించిన వ్యాక్సినేషన్‌ను పర్యవేక్షించిన ఆయన మాట్లాడుతూ క్షయ నివారణకు ముందు జాగ్రత్త చర్య మొదటి విడతలో భాగంగా షుగర్ వ్యాధి గ్రస్తులకు, పొగతాగు వారికి, గతంలో టీబీ వచ్చిన వారికి, బీఎంఐ 18 కంటే తక్కువ ఉన్న వారికి, 60 ఏళ్ల పైబడిన వారికి వ్యాక్సిన్ వేస్తామన్నారు. కార్యక్రమంలో డీపీఎంలు వెంకటరమణ, నవీన్‌కుమార్, డాక్టర్ పి. జ్యోత్స్న స్వర్ణలత, వినయ్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, సీహెచ్‌ఓలు చంద్రావతి, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

అంజనేయకొట్టాలులో...

ఖాజీపేట, మే 16: క్షయ రోగులపట్ల ప్రేమానురాగాలు చూపి ఆదరించాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సునీత అన్నారు. గురువారం ఆంజనేయకొట్టాలులో డాక్టర్ ముబీన్ ఆధ్వర్యంలో బీసీజీ వ్యాక్సినేషన్ గురించి వివరించారు. వ్యాధి నివారణకు ముందస్తు చర్యల్లో భాగంగా మొదటి విడతగా వ్యాక్సిన్ వేస్తామన్నారు. 2025కు భారతదేశంలో టీబీ పూర్తిగా నిర్మూలన చేయాలన్న సంకల్పంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి నాగభూషణం, సూపర్‌వైజర్ శోభన్‌బాబు, క్రిష్ణప్రియ, ఆశా నోడల్ ఆఫీసర్ అరుణకుమారి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు, తొట్టిగారిపల్లె, ఖాజీపేటలో వయోజనులకు బీసీజీ టీకా వేస్తున్న వైద్యసిబ్బంది



విద్యుత్తు తీగలా.. యమపాశాలా...


తక్కువ ఎత్తులో రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ఖాజీపేట, మే 16: రోజూ ఏదో ఒక చోట విద్యుత్తు తీగెలు తగిలి చనిపోతున్నారన్నా విద్యుత్తు అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. పిల్లలకు సైతం అందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి ఏళ్ల గడిచినా కనీసం కంచె ఏర్పాటులోనూ విఫలమయ్యారు. మొక్కుబడిగా విధులు నిర్వహిస్తున్నట్లు విమర్శలున్నాయి. కడప-కర్నూలు జాతీయ రహదారి పక్కనే ఉన్న ఖాజీపేట ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్తు తీగెలు చిన్నపిల్లలకు సైతం తగులుతాయి. నిత్యం ఈదారి రద్దీగా ఉంటుంది. ఏళ్ల గడుస్తున్నా ఇప్పటికీ కంచె ఏర్పాటు చేయలేదని, కనీసం ఇప్పటికైనా స్పందించి కంచెను ఏర్పాటు చేస్తే ప్రమాదాలు జరుగకుండా నివారించవచ్చని పలువురు అంటున్నారు. ఏది ఏమైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచెను ఏర్పాటు చేయాల్సి బాధ్యత ఎంతైనా ఉంది.

ఉత్సాహంగా సాగుతున్న సమ్మర్ క్యాంప్

ప్రొద్దుటూరు టౌన్, మే 16: గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ ఉత్సాహంగా సాగుతోంది. గురువారం రామేశ్వరంలోని బాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో వసంతపేట మున్సిపల్ హైస్కూలులో సమ్మర్ క్యాంప్ నిర్వహించారు. గణిత ఉపాధ్యాయురాలు నిర్మలాజ్యోతి అంకెలు, సంఖ్యలు, కూడికలు, బాగహారం, గుణకారం, స్థాన విలువలు, వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. రచయిత జింకా సుబ్రహ్మణ్యం విద్యార్థులకు వేమన పద్యాలను బోధించి వాటి బావాన్ని తెలిపారు. అనంతరం విద్యార్థులకు క్యారెంబోర్డు, చెస్ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రహింసాహెబ్, శారద, రవిబాబు, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.


ప్రొద్దుటూరులో గణితం బోధిస్తున్న ఉపాధ్యాయురాలు


కొండాపురంలో చదువుతున్న బాలుడు

వేసవి శిక్షణ శిబిరాన్ని ఉపయోగించుకోవాలి

కొండాపురం, మే 16: స్థానిక గ్రంథాలయంలో గురువారం నుంచి ప్రారంభమైన వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు ఉపయోగించుకోవాలని లైబ్రేరియన్ వరలక్ష్మి కోరారు. జూన్ 7 వరకు ఈ తరగతులు కొనసాగుతాయన్నారు. విద్యార్థులకు డ్రాయింగ్, కథలు, పద్యాలు చెప్పించడం, ఇంగ్లీష్ గ్రామర్, పేపర్ క్రాఫ్ట్ వంటి కృత్యాలను నేర్పిస్తారన్నారు. కార్యక్రమంలో అమీరుద్దీన్ పాల్గొన్నారు.

మురుగునీటిలో గేట్‌వాల్వ్

● తాగునీరు కలుషితమౌతోందని ప్రజల ఆవేదన
● గతంలో పైప్‌లైన్ మార్పిడి ● అధికారుల్లో స్పందనకరువు

ఎర్రగుంట్ల, మే 16: ప్రజలకు తాగునీరు సరఫరా అయ్యే ప్రధాన పైప్‌లైన్‌కు అమర్చిన గేట్‌వాల్ మురుగునీటిలో మునిగి ఉంది. ఫలితంగా తాగునీరు కలుషితమౌతున్నాయని ప్రజల నుంచి భారీగా ఫిర్యాదు లొచ్చాయి. ధర్నాలు చేసి, కార్యాలయ తాళాలకు వేసి అధికారులను నిలదీసిన సంఘటనలు కూడా జరిగాయి. ప్రజల ధర్నాలతో లక్షలు వెచ్చించి రోడ్డు తవ్వి కొత్త పైప్‌లైన్ వేశారు. అయినా గేట్‌వాల్వ్ మాత్రం మురికినీటిలోనే ఉంది. స్థానిక హైస్కూల్ గ్రౌండ్ మెయిన్‌గేటు వద్ద ఏర్పాటు చేసిన గేట్‌వాల్ పూర్తిగా మురుగునీటిలో వుంది. పక్కనే డ్రైనేజి కూడా ఉంది. ఇక్కడ తీవ్ర కంపు కొడుతోంది. దీని ద్వారానే ప్రజలకు తాగునీరు, బోరు నీరు వెళుతోంది. నిత్యం గేటువాల్వ్‌ను మూయడం, తెరవడం చేస్తున్నారు. ఇదే సమయంలో మురుగునీరు పైప్‌లైన్‌లో కలిసి ప్రజలకు కలుషిత నీరు సరఫరా అవుతోందని స్థానికులు వాపోతున్నారు. అయినా ఇక్కడ శుభ్రంగా ఉంచాల్సిన అధికారులు మాత్రం ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. పట్టణంలో ఇలాంటివి మరికొన్ని చోట్ల వున్నాయి. కాంట్రాక్టర్లు నాశిరకంగా పనులు చేసిన, మూడడుగుల భూమిలోపల ఉండాల్సిన పైప్‌లైన్స్ భూమిపైన్నే వేశారు. వాటిని ఇప్పటికీ అలాగే వదిలేశారు. అయినా పబ్లిక్ హెల్త్ అధికారులు బిల్లులు చేశారన్న ఆరోపణలున్నాయి. పట్టణంలో డ్రైనేజిలో, మురుగులో గేట్‌వాల్వ్ లేకుండా చూడాలని, తాగునీరు కలుషితం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఈ పైప్‌లైన్స్ ద్వారా వచ్చేనీటినే చాలా వరకు తాగేందుకు, వంటకు, హోటల్స్‌లోను, ఇతర చోట్ల వాడుతున్నారు. అధికారులు కేవలం ప్రకటనలు మానుకుని తాగునీటి గేట్‌వాల్వ్, పైప్‌లైన్ లీకేజిలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.


మురుగునీటిలో ఉన్న పైప్‌లైన్ గేట్‌వాల్వ్

సబ్సిడీ విత్తనాలు మంజూరు

కాశినాయన/పోరుమామిళ్ల,మే16: మండలానికి 50 శాతం సబ్సిడీతో పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు మంజూరైనట్లు కాశినాయన ఏఓ ప్రవీణ్ కుమార్, పోరుమామిళ్ల ఏఓ వరహరికుమార్ తెలిపారు. పోరుమామిళ్ల మండలానికి 90 క్వింటాళ్ల పచ్చిరొట్ట, కాశినాయన మండలానికి జీలుగలు 70 క్వింటాలు, జనుములు 10 క్వింటాలు, పిల్లిపెసర 2 క్వింటాలు వచ్చాయన్నారు. రైతులు ఆధార్ కార్డు, 1బీ తీసుకుని రైతుభరోసా కేంద్రాల్లో సబ్సిడీ పోను మిగిలిన డబ్బు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

విద్యార్థులు పుస్తక పఠనం అలవరుచుకోవాలి

పోరుమామిళ్ల, మే 16: వేసవి సెలవుల్లో విద్యార్థులు గ్రంథాలయంలో పుస్తకపఠనం అలవరుచుకుని విజ్ఞానవంతులు కావాలని జనవిజ్ఞానవేదిక జిల్లా కార్యవర్గ సభ్యులు దాదాపీర్, గ్రంథాలయ అధికారి అఫ్రిద్ పేర్కొన్నారు. గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించిన వారు మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవుల్లో పుస్తకపఠన అభిలాషను పెంపొందించుకోవాలన్నారు. దినపత్రికలు, వారపత్రికలు, మహనుభావుల జీవిత చరిత్రలు, కథలు, పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు. జూన్ 7 వరకు గ్రంథాలయంలో విజ్ఞానశిబిరాన్ని కొనసాగిస్తున్నామన్నారు. గఫార్, హసిమ్‌వల్లి, మహమ్మద్‌రఫి పాల్గొన్నారు.

అంధకారంలో ప్రధాన రోడ్లు

జమ్మలమడుగులో అధికారుల పనితీరు ఇదేనా...?



జమ్మలమడుగు, మే 16: మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన రోడ్లు అంధకారంగా మారాయి. ఆర్డీఓ కార్యాలయం నుంచి ముద్దనూరు రోడ్డులో ట్యాంకు వీధి వరకు వీధి లైట్లు వెలుగడంలేదు. ప్రొద్దుటూరు రోడ్డులో, తాడిపత్రి రోడ్డులో అక్కడక్కడా వీధిలైట్లు వెలుగక అంధకారంగా మారింది.

పాత బస్టాండు గాంధీ విగ్రహం వద్ద ఉన్న లైట్లు రెండు మాత్రమే వెలిగాయి. పట్టణం అంధకారంగా మారడంతో వాహనదారులకు, ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. ఎన్నికల అనంతరం జరిగిన పరిణామాలు, కొట్లాటలు చూసైనా అధికారులు పట్టణంలో నిరంతరం విద్యుద్దీపాలు వెలిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. పట్టణంలో 144 సెక్షన్ అమలులో ఉన్నా పోలీసు సిబ్బంది రోడ్లపై అంధకారంలోనే విధులు నిర్వహిస్తున్నారు. మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.